క్లుప్తంగా

పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ

అంబాజీపేట: పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల ప్రోత్సాహానికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని హెచ్ఎం ఏఎల్‌వీ ప్రసాద్ అన్నారు. ఇసుకపూడి జెడ్పీ హైస్కూల్‌కు భమిడి జగన్నాథం జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు భరద్వాజ్ రూ.15 వేల విలువైన అహూజా సౌండ్ బాక్స్‌ను బుధవారం అందజేశారు. అలాగే రిటైర్డ్ ఉపాధ్యాయుడు అయ్యగారి శ్రీనివాసు రూ.10 వేలను పాఠశాల అభివృద్ధికి అందించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష మెటీరియల్, ప్యాడ్లు, కాంపస్ బాక్సులను అందజేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్ బాబురావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, ఎస్ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేయించాలి



మాచవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న బోసుబాబు

అంబాజీపేట: ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మాచవరం, పుల్లేటికుర్రు గ్రామాల్లో ఏఓ సీహెచ్‌డీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో జరుగుతున్న రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ, గుర్తింపు సంఖ్యను నమోదు చేయించడం వల్ల రైతులకు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, పంట బీమా, యంత్ర పరికరాల రాయితీకి ఉపయోగపడుతుందన్నారు. 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యలేని వారికి ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. త్వరితగతిన రైతులు ఆయా గ్రామాల్లో ఉన్న వీఏఏలు, వీహెచ్ఏలను సంప్రదించాలన్నారు. రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకునే సమయంలో మూడు సార్లు ఓటీపీలు వస్తాయని, మొబైల్ కూడా తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ డి.దుర్గారావు, వీఏఏలు, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఎంఎస్ఎంఈ సర్వే



అంబాజీపేటలో సర్వేను పరిశీలిస్తున్న బోసుబాబు

అంబాజీపేట: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సర్వేను పారదర్శకంగా చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. అంబాజీపేటలో ఎంపీడీఓ జీవీ సరోవర్ పర్యవేక్షణలో ఎంఎస్ఎంఈ సర్వేను సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోసుబాబు మాట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమల సర్వేను మూడు రోజుల పాటు చేయనున్నామన్నారు. ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో ట్రేడింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, సర్వీస్ సెంటర్, సర్వీస్ షాపుల వివరాలను యాప్ ద్వారా సేకరిస్తారన్నారు. సర్వేకు వచ్చిన సిబ్బందికి ఆయా షాపుల నిర్వాహకులు సహకరించాలని కోరారు. మండలంలో ఇప్పటి వరకు 540 పరిశ్రమలను సర్వే చేశామన్నారు. సర్వేలో మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి కె.సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

శతజయంతిని విజయవంతం చేయాలి



దిండిలో సమావేశమైన సీపీఐ నాయకులు

మలికిపురం: సీపీఐ శత జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు పిలుపునిచ్చారు. బుధవారం దిండి గ్రామంలో రాజోలు నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం దేవ సురేష్‌బాబు అధ్యక్షతన జరిగింది. పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలు, వారి అభివృద్ధి కోసం సీపీఐ ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. సీపీఐ వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో నియోజకవర్గంలో శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాటు చేయాలన్నారు. సీపీఐ నాయకులు దేవ రాజేంద్రప్రసాద్, చెల్లుబోయిన తాతారావు, గెద్దం ప్రభాకరరావు, నల్లి బుజ్జిబాబు, దీపాటి గంగాచలం, మేడిచర్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానరోడ్లకు మోక్షమెప్పుడో?

- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- ఎనిమిది నెలలైనా నరకమే



అధ్వానస్థితిలో బాడిలంక రోడ్డు

మామిడికుదురు: రహదారుల అభివృద్ధిని గత ప్రభుత్వం గాలికి వదిలేసింది. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్లను అభివృద్ధి చేస్తాం అంటూ కూటమి నేతలు ఎన్నికల్లో ప్రజలకు వాగ్దానాలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచింది. కానీ రోడ్ల అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా పరిస్థితి తయారైంది. మొక్కుబడిగా కొన్ని రోడ్లను అభివృద్ధి చేసి చేతులు దులిపేసుకున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. మండలంలోని రోడ్ల పరిస్థితిని పరిశీలిద్దాం...

మెటల్ లేచిపోయిన బాడిలంక రోడ్డు...

లూటుకుర్రు నుంచి బాడిలంక వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు ఎక్కడికక్కడ మెటల్ లేచిపోయింది. పలు చోట్ల గోతులు పడి అధ్వానంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మామిడికుదురు సాయిబాబా ఆలయం సమీపాన లూటుకుర్రు ఎన్‌జీఆర్ కాలనీకి వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా చాలా దారుణంగా ఉంది. ఎంతో కాలం నుంచి ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకోవడం లేదు. మామిడికుదురు కొర్లగుంట శివారు ఏటిగట్టు నుంచి అప్పనపల్లి వెళ్లే మార్గంలో సుమారు 300 మీటర్ల రోడ్డు కూడా అభివృద్ధికి నోచుకోలేదు.

ఆర్అండ్‌బీ రోడ్లదీ అదే పరిస్థితి

ఆర్అండ్‌బీ రోడ్ల పరిస్థితి కూడా ఇంచుమించు ఇదే విధంగా ఉంది. పాశర్లపూడి ఏటిగట్టు నుంచి అప్పనపల్లి పెంకుడుశాల వరకు రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఇదే రోడ్డులో అప్పనపల్లి మలుపు నుంచి బి.దొడ్డవరం మీదుగా పెదపట్నం లంక వెళ్లే రోడ్డు పరిస్థితి దయనీయంగా ఉంది. ఈ రోడ్డుపై ప్రయాణం అంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. దీనికి కనీస మరమ్మతులు కూడా నిర్వహించకపోవడంతో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. రోడ్డు పలు చోట్ల దిగబడిపోయి, కంకర లేచిపోయి నరకప్రాయంగా మారింది. అప్పనపల్లి పిచ్చుక వారి ఇంటి నుంచి గ్రామ దేవత కనకమహాలక్ష్మి ఆలయం వరకు ఉన్న రోడ్డు సైతం ఇదే విధంగా ఉంది. పాలకులు, అధికారులు తక్షణం ఈ రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్లను తక్షణం అభివృద్ధి చేయాలి



పాడైపోయిన రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలి. లూటుకుర్రు గ్రామం నుంచి బాడిలంక వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైపోయింది. దీంతో పాటు ఎన్‌జీఆర్ కాలనీకి వెళ్లే కాలువ గట్టు రోడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. ఈ రోడ్లను అభివృద్ధి చేస్తామని ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఆ హామీని వెంటనే నిలుపుకోవాలి. ప్రజల నుంచి ఇప్పటికే రోడ్ల అభివృద్ధిపై నిరసన వ్యక్తమవుతోంది. తక్షణం ఇచ్చిన హామీని నిలుపుకోవాలి.

– అదబాల చక్రపాణి, లూటుకుర్రు

హామీలు ఎప్పటికి అమలు చేస్తారు



సంక్రాంతి పండుగ నాటికి రోడ్లు అభివృద్ధి చేస్తామన్నారు. సీఎం దీనిపై స్వయంగా ప్రకటన చేశారు. కానీ ఎక్కడా ఆ హామీ అమలుకు నోచుకోలేదు. మండలంలో రోడ్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైంది. ఇప్పటికైనా హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్లాలి. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లను వెంటనే అభివృద్ధి చేయాలి.

– చేట్ల సత్యనారాయణ, ఈదరాడ

దివ్యాంగులు, చిన్నారుల సర్వే ప్రారంభం



అలమూరులో సర్వే నిర్వహిస్తున్న కోర్టు, వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతినిధులు

ఆలమూరు: రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ గ్రామాల్లో బుధవారం దివ్యాంగులు, శిశువులు, చిన్నారుల సర్వే ప్రారంభమైంది. ఆలమూరు జూనియర్ సివిల్‌కోర్టు ఇన్‌చార్జి జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ ప్రత్యేక అధికారి, న్యాయవాది కె.ధనరాజు నేతృత్వంలో కోర్టు, వైద్య ఆరోగ్య, ఆశ, పంచాయతీరాజ్ సిబ్బంది తొలుత ఆలమూరులో ఇంటింటి సర్వే ప్రారంభించారు. ఒకటి నుంచి 19 యేళ్ల లోపు దివ్యాంగుల వివరాలతో పాటు అప్పుడు పుట్టిన శిశువు నుంచి ఆరు నెలల చిన్నారి వివరాలను కూడా సేకరించి యాప్‌లో నిక్షిప్తం చేశారు. దీనివల్ల అర్హులైన దివ్యాంగులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడంతో పాటు సమస్యలుంటే సత్వరం పరిష్కరించేందుకు ఈసర్వే దోహదపడుతుందని కోర్టు ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగానే స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు పరిధిలోని ఆలమూరు, మండపేట టౌన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలాలకు సంబంధించి ఒక్కో న్యాయవాదిని నియమించి అన్ని గ్రామాల్లోనూ సర్వేను నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన దివ్యాంగులకు సదరం ధ్రువపత్రాలను అందిస్తామని, చిన్నారులకు సకాలంలో వైద్యసేవలు అందే విధంగా ఈ సర్వే దోహదపడుతుందని పేర్కొన్నారు. మహిళ ఆరోగ్య సంరక్షణ కార్యదర్శులు ఎస్.సంధ్యారాణి, ఈ.వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కె.సత్యనారాయణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జియో టెక్స్‌టైల్స్ ఉత్పత్తిని గణనీయంగా పెంచాలి



చొప్పెల్లలో కామన్ ఫెసిలిటీ సెంటర్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్

ఆలమూరు: రహదారులు, కాలువ గట్లు నిర్మాణంలో వినియోగించే జియో టెక్స్‌టైల్స్‌ను క్వాయర్ క్లస్టర్స్ సంస్థలు విరివిగా ఉత్పత్తి చేసి లాభాలను సముపార్జించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అన్నారు. మండలంలోని చొప్పెల్లలో ఉన్న కడియపులంక క్వాయర్ క్లస్టర్‌ను జిల్లా పరిశ్రమశాఖ అధికారులతో కలసి బుధవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2017లో స్ఫూర్తి కార్యక్రమంలో భాగంగా ఈ కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటుకు రాయితీపై రూ.4.11 కోట్ల రుణం మంజూరు చేసిందన్నారు. అందులో భాగంగా సంప్రదాయ కొబ్బరి ఉత్పత్తులతో పాటు అధునాతన నిర్మాణ రంగంలో ఉపయోగించే జియో టెక్స్‌టైల్స్‌ను తయారు చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమలను ప్రోత్సహిస్తుందని వివరించారు. అనంతరం కామన్ ఫెసిలిటీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కొబ్బరి పీచు, తాళ్లు, కార్పెట్లు, జియో టెక్స్‌టైల్స్ తయారు చేసే యంత్రాలను పరిశీలించారు. ఉత్పత్తులను తయారు చేసే విధానాన్ని జియో టెక్స్‌టైల్స్‌ను కొబ్బరి ఉత్పత్తులను తయారు చేయడం వల్ల కలిగే లాభాలను, ప్రయోజనాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, గౌతమి క్వాయర్ క్లస్టర్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఇండస్ట్రీస్ ఏడీ శివరామకష్ణ, క్వాయర్ బోర్డు ట్రైనర్ రమేష్, ఉద్యానశాఖ అధికారి జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించే దిశగా చర్యలు

- ఎమ్మెల్యే దేవ వరప్రసాద్
- సాదాసీదాగా మండల పరిషత్ సమావేశం



రాజోలు మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు: సాగునీరు, మురుగునీరు పారుదలకు ఆటంకాలు కలిగించే విధంగా ఉన్న ఆక్రమణలను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం రాజోలు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాబోయే వేసవిని దృష్టిలో ఉంచుకుని అధికారులు తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పారిశుద్ధ్యం పనులపై ఎమ్మెల్యే దేవ అసంతృప్తి వ్యక్తం చేశారు. నియోజకవర్గ కేంద్రమైన రాజోలులో ఎక్కడి చెత్త అక్కడే ఉండటూ, ఎన్ని పర్యాయాలు చెప్పినా పనులు చేయరా.. ఎమ్మెల్యే మీ చుట్టూ తిరగాలా అంటూ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త చెదారం తొలగించాలని, వాహనచోదకులు ప్రమాదాలకు కారణమయ్యే మొక్కలను తొలగించాలని సూచించారు. ముఖ్యంగా పంట కాలువలు, మురుగునీటి డ్రైన్ల గట్లు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఆక్రమణల కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆక్రమణలు తొలగించేందుకు పంచాయతీ కార్యదర్శుల స్థాయిలో చర్యలు చేపట్టాలన్నారు. జెడ్పీటీసీ మట్టా శైలజ మాట్లాడుతూ గత ప్రభుత్వం కరోనా సమయంలో ప్రజలకు రక్షణగా నిలిచిందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు పొలమూరి శ్యాంబాబు, ఇంటిపల్లి ఆనందరాజు, గుండుబోగుల పెదకాపు, ఎంపీడీఓ డి.రాంబాబు, తహసీల్దార్ ఎన్ఎస్ ప్రసాద్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఇంజిన్లు ఏర్పాటు చేసి సాగునీరందించాలి



పి.గన్నవరంలో వాటర్ డీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న చైర్మన్ గుబ్బల

పి.గన్నవరం: పంట కాలువల శివారు భూములకు సాగునీరు అందని పక్షంలో క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేసి ఆయిల్ ఇంజిన్ల ద్వారా నీరందించాలని సెంట్రల్ డెల్టా వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఇరిగేషన్ డీఈఈ కార్యాలయంలో బుధవారం జరిగిన గోదావరి సెంట్రల్ డెల్టా డిస్ట్రిబ్యూటరీ కమిటీ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. వరి నాట్లు పడిన ప్రతి ఎకరాకు నీటి ఎద్దడి సమస్య రాకుండా సాగునీరు అందించాలని నీటి సంఘాలకు సూచించారు. అధికారులను, రైతులను సమన్వయం చేసుకుని నీటి సంఘాలు పనిచేయాలని సూచించారు. లస్కర్లకు సకాలంలో జీతాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. తొలుత ఆయన డీసీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సమావేశం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్, డీఈ నాగేంద్రకుమార్, ఏఈ సుందరసింగ్, డీసీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణ మూర్తి, నీటి సంఘాల అధ్యక్షులు కడలి కృష్ణమోహన్, గాలిదేవర వెంకన్నబాబు, మద్దాల తమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తాకట్టు బాధితుల ఆందోళన



కొత్తపేటలో తాకట్టు వడ్డీ వ్యాపారం షాపు వద్ద ఆందోళన చేస్తున్న బాధితులు

కొత్తపేట: స్థానిక ఒక తాకట్టు వడ్డీ వ్యాపారం షాపు మూసేయడంతో బంగారం, వెండి వస్తువులు తాకట్టు పెట్టిన బాధితులు బుధవారం ఆందోళనకు దిగారు. స్థానిక మెయిన్‌రోడ్డులో సత్యసూర్య బ్యాంకర్స్ (తాకట్టు వడ్డీ వ్యాపారం) నిర్వహిస్తున్న కూర్మదాసు హేమంత్‌కుమార్ గత పది రోజుల క్రితం షాపు మూసేసి కనిపించకుండా వెళ్లిపోయాడు. ఈ విషయం స్థానికంగా అలజడి రేగింది. పలువురు పోలీసులను కూడా ఆశ్రయించారు. ఇదిలా ఉండగా బుధవారం మండలంలో పలు గ్రామాల నుంచి ఆ షాపులో బంగారం, వెండి వస్తువులు తాకట్టు పెట్టిన బాధితులు సంబంధిత షాపు వద్దకు వచ్చి ఆందోళన చేపట్టారు. దీంతో ఆ షాపు లైసెన్స్‌దారుడు శ్రీఘాకోళ్లపు రామకృష్ణ తండ్రి, ప్రక్కనే ఉన్న సత్యప్రియ ఎంపోరియం షాపు యజమాని శ్రీఘాకోళ్లపు సత్యనారాయణ వచ్చి మీరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, పోలీసుల సమక్షంలో షాపు తెరిచాక వస్తువుల తాకట్టుకు సంబంధించి రికార్డులు పరిశీలించి ఎవరి వస్తువుల వారికి అప్పగిస్తామని హామీ ఇచ్చారు. దాంతో బాధితులు ఆందోళన విరమించారు.

వైభవంగా వీరభద్రుని సంబరం



అప్పనపల్లిలో నిర్వహిస్తున్న వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: అప్పనపల్లిలో వీరభద్రస్వామి సంబరం బుధవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామి వారిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద తులా గోపాలకృష్ణ, నాగసూర్యావతి దంపతులతో పాటు కంకిపాటి హేమంత్‌నాగేంద్రకుమార్, తులా ఏసునాయుడు, తులా ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరాన్ని ఘనంగా జరిపించారు. స్థానికంగా ఉన్న సాయి వీరభద్రస్వామి ఆలయం వద్ద విఘ్నేశ్వర పూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు వీరభద్రస్వామికి శూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశింపచేశారు. ఈ పూజలు ఆద్యంతం కనుల పండువలా నిర్వహించారు. పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది.

మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులు శిక్షార్హులు

– డీఎస్పీ ప్రసాద్ హెచ్చరిక



సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం రూరల్: డ్రైవింగ్ లైసెన్స్‌కు అర్హత లేని మైనర్లు వాహనాలు నడిపితే, వారితో పాటు తల్లిదండ్రులు శిక్షార్హులని డీఎస్పీ పీఎస్ఆర్‌కే ప్రసాద్ హెచ్చరించారు. రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా కామనగరువు ఆదిత్య పాఠశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ప్రిన్సిపాల్ రామప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన డీఎస్పీ ప్రసాద్, డీటీవో దేశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఇటీవల పేరూరులో జరిగిన రోడ్డు ప్రమాదం కేసులో విద్యార్థి తండ్రిని రిమాండ్‌కు పంపినట్టు తెలిపారు. విద్యార్థి దశ నుంచే రహదారి భద్రతపై అవగాహన ఉండాలని చెప్పారు. 18 ఏళ్లు నిండని వారికి డ్రైవింగ్ లైసెన్స్ పొందే అర్హత ఉండదని స్పష్టం చేశారు. రోడ్లపై మైనర్లు వాహనాలు నడపడం నిషిద్ధమని తెలిపారు. తల్లిదండ్రులు మోటార్ సైకిల్‌పై బయటకు వెళ్లేటప్పుడు హెల్మెట్, కారులో వెళితే సీట్ బెల్టు విధిగా ధరించాలని పిల్లలు చెప్పాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రహదారి భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఎంవీఐ రవికుమార్ విద్యార్థులకు ట్రాఫిక్ సిగ్నల్స్‌పై అవగాహన కల్పించారు. అమలాపురం ఏఎంవీఐలు కాశీవిశ్వేశ్వరరావు, కౌశిక్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చలపతిరావు, వైస్ ప్రిన్సిపాల్ సుధ, సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దానియేలు మృతి తీరని లోటు



ఎన్‌జేఎం చర్చి అధినేత దానియేలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కోఆర్డినేటర్ గన్నవరపు

పి.గన్నవరం: పెదకందాలపాలెం ఎన్‌జేఎం చర్చి అధినేత జీవీ దానియేలు ఆకస్మిక మృతి తీరనిలోటని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. దానియేలు చిత్రపటానికి బుధవారం ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. దానియేలు కుటుంబాన్ని పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, పితాని నర్సింహరావు, విత్తనాల శేఖర్, సాధనాల రమేష్, చింతా రవి, మంగం శ్రీను, బొక్కా ఏడుకొండలు, నూకపెయ్యి రాజేంద్రప్రసాద్, పిల్లి శ్రీను, కాంద్రేగుల అనంతబాబుతదితరులు ఉన్నారు.

అంబాజీపేట: ఇరుసుమండలో సోదర వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు, సొసైటీ మాజీ అధ్యక్షుడు నాగాబత్తుల సత్యానందరావును పి.గన్నవరం నియోజకవర్గ కో ఆర్డినేటర్, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బుధవారం పరామర్శించారు. అకాల మృతి చెందిన సూర్యనారాయణ చిత్రపటం వద్ద నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించి, ఆయన పవిత్రఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపీటీసీలు సత్యనారాయణమ్మ, ప్రశాంత్, దొమ్మేటి రాధాసూర్యనారాయణ, మట్టపర్తి హరి, మర్రి రాజు, కోట హనుమంతరావు తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్: ఈదరపల్లిలో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో సీటీ మార్పు, మరమ్మతుల కోసం శుక్రవారం అమలాపురం పట్టణ, రూరల్, అల్లవరం, అయినవిల్లి మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ కె.రాంబాబు తెలిపారు. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

15న అయినవిల్లిలో సీజీఆర్ఎఫ్ సదస్సు

అయినవిల్లి: విద్యుత్ వినియోగదారులు పరిష్కారం కోసం ఈ నెల 15న అయినవిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీజీఆర్ఎఫ్ సదస్సులు నిర్వహించనున్నట్లు కోనసీమ సర్కిల్ విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.రాజబాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారుల పరిష్కారానికి సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సులకు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్) చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు బి.సులేఖారాణి (టెక్నికల్ మెంబర్), షేక్ బాబర్ (ఫైనాన్స్ మెంబర్, ఎన్.మురళీకృష్ణ (ఇండిపెండెంట్ మెంబర్) తదితరులు హాజరవుతారన్నారు. అలాగే 15న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ ఈ సదస్సు ఉంటుందన్నారు. ఈ సదస్సులో వినియోగదారులు నేరుగా పాల్గొని విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చుతగ్గులు, బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి తదితర విద్యుత్ సంబంధిత సమస్యలపై ఫిర్యాదులను చైర్ పర్సన్ సీజీఆర్ఎఫ్ కమిటీకి తెలియజేయవచ్చన్నారు. అంతే కాకుండా విశాఖపట్నం, సీతమ్మధారలోని ఏపీఈపీడీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉన్న సీజీఆర్ఎఫ్ కార్యాలయానికి లిఖిత పూర్వకంగా కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. వినియోగదారుల సమస్యలను, వాటి వివరాలను పరిశీలించి, విచారణ చేసి తగిన న్యాయం చేస్తామని ఆయన తెలిపారు.

రోడ్డు నిబంధనలు విధిగా పాటించాలి



మొగలికుదురులో విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

మామిడికుదురు: రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని రావులపాలెం ఎంవీఐ శ్రీనివాస్ సూచించారు. మొగలికుదురు శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు, పేరెంట్స్‌కు రోడ్డు ట్రాఫిక్ నిబంధనలు, భద్రతపై అవగాహన బుధవారం కలిగించారు. ప్రయాణం సమయంలో హెల్మెట్‌తో పాటు సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. నిబంధనలు పాటించడం ద్వారా సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తామంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతా నిబంధనలపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజ్‌కుమార్, ప్రిన్సిపాల్ సూదా లక్ష్మి, డీన్ రమేష్, ఇన్‌చార్జ్‌లు శ్రీనివాస్, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహానికి కృషి



ఎంఎంఎస్ఎంఈ పథకంపై వ్యాపారులకు వివరిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, అందులో భాగంగానే అర్హులైన చిరు వ్యాపారులకు రుణాలను అందించేందుకు ప్రణాళికను సిద్ధం చేసిందని ఎంపీడీఓ ఎ.రాజు అన్నారు. ఆలమూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి కె.మోక్షాంజలి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్థానిక చిరు వ్యాపారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మినిస్ట్రీ ఆఫ్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎంఎస్ఎంఈ) ద్వారా అర్హులైన చిన్న తరహా పరిశ్రమ యజమానులకు రాయితీపై రూ.లక్ష నుంచి రూపది లక్షల వరకూ రుణాలను అందిస్తుందన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి వ్యాపారులకు ఎంఎంఎస్ఎంఈ పథకంపై సమగ్రంగా వివరించారు.

సాగు నీటి కోసం రైతుల నిరసన



వన్నె చింతలపూడిలో పొలంలో నిరసన తెలుపుతున్న రైతులు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడిలో సాగునీరు రాకపోవడంతో వరి చేనుకు బీటలు వారాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతులను పట్టించుకునే నాథుడే లేడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. వరి చేనుకు నీరు అందకపోవడంతో రైతులతో పాటు, కౌలు రైతులు దిగులు చెందుతున్నారు. ఒక్కో రైతు సుమారు పదెకరాలు కౌలు సాగు చేస్తున్నా అధికారులు నీరు అందించడం లేదన్నారు. కనీసం కాలువ పూడిక తొలగించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణం సాగునీరు అందించకపోతే తీవ్రనష్టం వాటిల్లుతుందని, అధికారులు స్పందించి నీరందించాలని రైతులు బుధవారం తమ పంట చేలలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కౌలు రైతులు పెయ్యల సత్యనారాయణ, బూల జగపతి, పరమట వసంతరావు పాల్గొన్నారు.